క్లుప్తంగా

మా పరిధి సమస్యలకు తక్షణమే పరిష్కారం

కందుకూరు తహసీల్దార్ గోపాల్



సాయిరెడ్డిగూడలో అధికారులకు అర్జీలు అందిస్తున్న రైతులు తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డి గూడ, కందుకూరు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. తహసీల్దార్ గోపాల్, నాయబ్ తహసీల్దార్ శేఖర్ ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ప్రజల నుంచి భూ సమస్యల పరిష్కారమై అర్జీలు తీసుకున్నారు. తమ పరిధిలో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, మిగతా వాటిని ఉన్నతాధికారులకు పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇ.రాంచంద్రారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కందుకూరు: మండల పరిధిలోని సరస్వతిగూడలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న లేమూరుకు చెందిన దప్పు ఈశ్వరయ్య(60) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో రెండు గ్రామాలకు చెందిన పెద్దలు పీఏసీఎస్ వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బూసరమోని యాదయ్య, రాము, నాయకులు నర్సింహ, శ్రీధర్, శ్రీనివాస్, మహేందర్, గోపిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నరేశ్, మల్లేశ్, రవీందర్, ఇంద్రసేన తదితరులు ఈశ్వరయ్య భౌతిక కాయానికి నివాళి అర్పించారు. మృతుడి భార్య జంగయ్య పేరిట రూ.70 వేలు బ్యాంకులో డిపాజిట్ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అనితారెడ్డి

మహేశ్వరం: పేదలను ఆదుకునేందుకు ఆర్ట్(అనితారెడ్డి తీగల) ఫౌండేషన్ పని చేస్తుందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, ఫౌండేషన్ ఫౌండర్ తీగల అనితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి అమీర్‌పేట్ గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. నిత్యం వాకింగ్, యోగ, ధ్యానం, వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, నాయకులు రాజేందర్, చంద్రమోహన్, కేజే.ప్రసాద్, రఘుపతి, నవీన్, పలువురు పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో బొడ్రాయి పండుగ



ఉత్సవాలకు హాజరైన భక్తులు

హుడాకాంప్లెక్స్: గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో పూజించాలని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బోయిని మహేందర్ యాదవ్ అన్నారు. సరూర్‌నగర్ బొడ్రాయి పండుగ 3వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకు బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ నెల 22వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ వేడుకల్లో శంకర్‌యాదవ్, బాబన్న, అంజయ్య, భిక్షపతి, ధనంరెడ్డి, నర్సింహగౌడ్, దత్తురామ్, ప్రమోద్, దుర్గయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మన్సాన్‌పల్లికి ఎమ్మెల్యే రాక

మహేశ్వరం: మండల పరిధి మన్సాన్‌పల్లిలో ఎమ్మెల్యే సబితారెడ్డి పర్యటించనున్నారని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. మన్సాన్‌పల్లి కూడలిని విస్తరించి, అభివృద్ధి చేస్తానని గతంలో ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, అందులో భాగంగానే కూడలిని పరిశీలించేందుకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులతో కలిసి ఆమె శనివారం మధ్యాహ్నం12 గంటలకు రానున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీగా హాజరు కావాలని కోరారు.

నిర్వహణ లేక నిరుపయోగం

- కళ తప్పుతున్న ఓపెన్ జిమ్‌లు
- పర్యవేక్షణ లేక మూలన పడుతున్న పరికరాలు

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడి పరికరాలు మూలన పడుతున్నాయి. వేల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన జిమ్‌ల నిర్వాహణను అధికారులు పట్టించుకోక పోవడంతో పాడైన పరికరాలు మరమ్మతుకు నోచుకోవడం లేదు. మరికొన్ని చోట్ల సామగ్రి చోరీకి గురయ్యాయి. కాగా పరికరాలను బాగు చేయించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

ఇటీవల మంత్రాల చెరువు ఓపెన్ జిమ్‌లోని పరికరం మీదపడి ఐదేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే. సాయంత్రం వేళ స్థానికంగా ఉండే చిన్నారులు పార్కులు, కమ్యూనిటీ హాళ్లలోని ఓపెన్ జిమ్‌లకు వెళ్తుంటారని, మరమ్మతులకు నోచుకోని పరికరాలు ఎక్కడ మీద పడతాయోనని కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారు. మంత్రాల చెరువు ఘటన పునరావృతం కాకుండా వీలైనంత త్వరగా జిమ్‌లలో పరికరాలకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.



విజ్ఞానపురికాలనీ జిమ్‌లో ఓ పరికరానికి సాయంగా పెట్టిన రాళ్లు



మరమ్మతుకు నోచుకోని పరికరం

పరిశీలనకే పరిమితం



విజ్ఞానపురికాలనీలో ఓపెన్ జిమ్‌లోని పరికరాలు ఏడాది క్రితమే పాడయ్యాయి. మూడు నెలల క్రితం మున్సిపల్ అధికారులు సందర్శించి వెళ్లారే తప్ప ఇప్పటివరకు మరమ్మతులు చేయించలేదు. ఓ పరికరాన్ని తొలగించి పక్కన పెట్టాం. మరో పరికరానికి రాళ్ల సహాయంగా పెట్టాల్సి వచ్చింది.

– ఆర్.కృష్ణ, విజ్ఞానపురికాలనీ అధ్యక్షుడు

పట్టించుకోని అధికారులు



శ్రీసాయి కృపానగర్‌లోని ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతు చేయించాలని అధికారులకు పలుమార్లు విన్నవించాం. అయినా పట్టించుకోవడం లేదు. సుమారు పది కాలనీల వాసులకు ఈ జిమ్ ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం నిర్వహణ లోపం కారణంగా జిమ్‌కు రాని పరిస్థితి నెలకొంది.

– అనిత, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు, జిల్లెలగూడ

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం రమాదేవి శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు రాజుగౌడ్, బాస శ్రీనివాస్, పులిజాల వివేక్, గట్టయ్యలు హాజరై విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి చదువులో ముందుకు సాగాలన్నదే తమ ఆశయమని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందజేయడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీతో విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గి, వారిలో పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న స్థానిక నాయకులు రాజుగౌడ్, బాస శ్రీనివాస్, పులిజాల వివేక్, గట్టయ్యలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వారి సహాయ సహకార పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నాయన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఈ టిక్నో సొల్యూషన్ నిర్వాహకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ టిక్నో సొల్యూషన్ డైరెక్టర్ ఎం.వీ సుధీర్ కృష్ణ చౌదరి సహకారంతో నోట్ పుస్తకాలు, పెన్నులు ఇతర స్టేషనరీ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ రాందాస్ రాణి, ప్రధానోపాధ్యాయుడు ఎం.జైపాల్, మాజీ కార్పొరేటర్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, స్థానికులు లింగారెడ్డి, విజ్ఞాన్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్‌గౌడ్, ఐలమ్మ, వార్డు ఆఫీసర్ మానస, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి



నిలువ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో శుక్రవారం ఫ్రై డే-డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్‌లు, మున్సిపల్ సిబ్బంది కలిసి నీటి నిలువ ప్రాంతాలను గుర్తించి వాటిని తొలగించారు. గృహాలలోను నీటిని నిలువ ఉండకుండా చూసుకోవాలని, లేదంటే దోమల వ్యాప్తి పెరిగి రాబోయే వర్షాకాలంలో రోగాల బారిన పడే అవకాశం ఉంటుందని ప్రజలకు వివరించారు. నీటి నిలువను తొలగించి డెమోపాస్ కెమికల్‌ను స్ప్రే చేయించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, జవాన్లు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా వాటర్ ప్లాంట్లు

- పాఠశాలల్లో నీటి కోసం విద్యార్థుల పాట్లు
- వెంట తెచ్చుకున్న నీరే దిక్కు

శాస్త్రిపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న ప్రభుత్వం మాటలను మాత్రం ఆచరణలో పెట్టడం లేదు. విద్యార్థులకు తాగు నీరు అందించడానికి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎలక్ట్రికల్ వాటర్ ప్యూరిఫయర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ మిషన్లు పనిచేయడం లేదు. వాటర్ మిషన్లను నామమాత్రంగా ఏర్పాటు చేసినా అధికారులు వాటి పనితీరు పట్టించుకోకపోవడంతో అవి పాడై మూలపడ్డాయి.

- శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని ప్రభుత్వ ఉర్దూ, ఇంగ్లిష్, తెలుగు మీడియం ప్రైమరీ పాటశాలల నుంచి హైస్కూల్ వరకు ఏ పాఠశాలలోనూ మినరల్ వాటర్ ప్లాంట్‌లు పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి మంచినీటిని తెచ్చుకుంటున్నారు. హసన్‌నగర్ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వాటర్ ఫిల్టర్ లేకపోవడంతో టీచర్లే వాటర్ బబుల్స్‌ని ఏర్పాటు చేసి విద్యార్థుల దాహార్తిని తీరుస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని విద్యార్థులకు అవసరమైన తాగు నీటి వసతిని కల్పించాలని తల్లితండ్రులు కోరుతున్నారు.



హసన్‌నగర్ పాఠశాలలో విద్యార్థులు



చింతల్‌మెట్ పాఠశాలలో.. వాటర్ ప్లాంట్



ఇంటి నుంచి తెచ్చుకున్న నీటిని తాగుతున్న విద్యార్థిని



హసన్‌నగర్ బడిలో ఏర్పాటు చేసిన వాటర్ బబుల్

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

సీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధి సంతోశ్

మొయినాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నతంగా అభివృద్ధి చెందాలని సీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధి సంతోశ్, అమ్డాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఉపాధ్యాయులతో కలిసి మండల పరిధిలోని అమ్డాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం యూనిఫాం, మధ్యాహ్న భోజనం, రీడింగ్ బుక్స్ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కైసర్ అహ్మద్, వినోద్‌కుమార్, ఆశ వర్కర్ రజనీ, సంస్థ ప్రతినిధులు నందు, ఆంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అమ్డాపూర్ ఎంపీపీఎస్‌లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

‘అవేర్’ సేవలు అభినందనీయం

తుమ్మలూరు మాజీ సర్పంచ్ సురేఖారెడ్డి

మహేశ్వరం: పేదలకు అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేయడం అభినందనీయమని తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది సురేఖారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తుమ్మలూరు పంచాయతీ కార్యాలయంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో మాధవస్‌జీ ఆస్పత్రి వైద్యుల సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 135 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సురేఖారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలన్నారు. వాకింగ్, వ్యాయామం, యోగా, ధ్యానం దైనందిన జీవంతంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు జంగయ్య, కరుణాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీహరి ముదిరాజ్, వెంకట్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు, అవేర్ సంస్థ కార్యానిర్వాహక అధికారి వెంకన్న, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తుమ్మలూరులో కొనసాగుతున్న వైద్య శిబిరం

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ

కందుకూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ సూచించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నేదునూరు మోడల్ స్కూల్, పులిమామిడి జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్లాంట్స్ గివింగ్ డే నిర్వహించారు. విద్యార్థుల ద్వారా తల్లులకు పండ్ల మొక్కలు, తండ్రులకు నీడనిచ్చే మొక్కలను అందజేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..రానున్న రోజుల్లో మొక్కలు పెంచకపోతే పర్యావరణం దెబ్బతిని మనుషుల మనుగడకే ప్రమాదం కానుందన్నారు. మొక్కల పెంపకాన్ని ఓ ఉద్యమంగా చేపట్టాలని కోరారు. విద్యార్థులు గ్రామాల్లో తల్లిదండ్రులతో పాటు అందరికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ సంస్థ ప్రతినిధి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న ఉపాధ్యాయులు, నిర్వాహకులు

ఇక్కడి రైతులకు ‘భరోసా’ ఇవ్వండి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య
- మంత్రి తుమ్మలకు విన్నపం

మహేశ్వరం: మహేశ్వరం, కందుకూరు మండలాల రైతులకు పెట్టుబడి సాయం (రైతు భరోసా) అందజేయాలని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య కోరారు. శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని, నగరానికి సమీపానే ఉందన్న సాకుతో ఇక్కడి రైతులకు అన్యాయం చేయడం తగదని పేర్కొన్నారు. ఈ ప్రాంత రైతులు ఎక్కువగా సాగుపైనే ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, వరితో పాటు ఉద్యాన పంటలు పండిస్తారని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి వారికి పెట్టుబడి సాయం అందజేయాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి.. ఉన్నతాధికారులతో మాట్లాడి భరోసా నిధులు విడుదల చేస్తామని హామీనిచ్చారు. యాదయ్యతో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎర్ర చంద్రమోహన్ ఉన్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేసిన యాదయ్య

కార్మికులు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

మణికొండ: ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారు వారి ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని మణికొండ మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మణికొండ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 300 మంది కార్మికులకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుమ్ము, ధూళి, మురుగులో పని చేసే కార్మికులకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి పూర్తి స్థాయి ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకుని వైద్యుల సూచనలు, సలహాలను పాటించి ఆరోగ్యంన్ని సంరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, భారత్ వికాస్ పరిషత్ ప్రాంత సంపర్క్ ఉపాధ్యక్షుడు రఘు సతీష్‌కుమార్, మణికొండ బ్రాంచ్ అధ్యక్షుడు ఎం.పెంటారెడ్డి, కార్యదర్శి బాల భారతి, కోశాధికారి అజయ్ కుమార్, శానిటేషన్ ఇంచార్జి సంపత్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ కార్మికులు

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని 9వ వార్డు రాజీవ్‌నగర్, వెంకటరమణ కాలనీల్లోని పార్కుల అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కనీస మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో నాయకులు బాబర్‌ఖాన్, చెన్నయ్య, రఘునాయక్, అప్పి, చంద్రశేఖర్, మంగులాల్ నాయక్, చింటు, మాధవులు, ఇబ్రహీం, ప్రవీణ్, అంజయ్య, బస్వం, ఖదీర్, నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు.. తప్పని ఇబ్బందులు

- వాహనదారులకు ఇక్కట్లు
- గుంతల్లో పడి గాయపడుతున్న పాదచారులు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం నిల్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

అత్తాపూర్: గుంతలు పడిన రోడ్లు.. నాణ్యత లేని డ్రైనేజీల నిర్మాణాలు, పై కప్పులు లేని డ్రైనేజీల మ్యాన్‌హోళ్ల కారణంగా బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాల బారిన పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ ఓల్డ్ విలేజ్ కుమ్మరి బస్తీ, హైదర్‌గూడ, జనప్రియ యూటోపియ, ఫిష్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా తయారయ్యాయి. మ్యాన్‌హోల్స్ విషయంలో కానీ రోడ్డు నిర్మాణ పనుల విషయంలో కానీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మ్యాన్‌హోళ్ల పనులు, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి మూడు నెలలు కూడా కాలేదు తిరిగి ఇప్పుడే పనులు చేయలేమంటూ అధికారులు చెబుతున్నారు. మంచినీటి పైపులైన్ లీకేజీలకు ఎలాంటి మరమ్మతులు చేయకుండానే నాణ్యతలేని కంకర ఇసుకతో మమ అనిపిస్తూ చేతులు దులుపుకొంటున్నారు. అవికాస్త మూడు రోజులకే తిరిగి లీకవుతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల గుండా రాకపోకలు సాగించే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాణ్యత లేని పనులు అంగీకరించే ప్రసక్తే లేదని అలాంటి పనులు చేసినా కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడుతున్నామని హెచ్చరికలు జారీ చేసిన ప్రయోజనం లేకుండా పోతుందని అధికారులు చెబుతున్నారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన ఉండాలని వారు పేర్కొంటున్నారు. నిర్మాణ సమయంలో బాధ్యతకల్గిన ప్రజలుగా నాణ్యత, ప్రమానాలపై సంబంధిత కాంట్రాక్టర్‌ను నిలదీయాలని చెబుతున్నారు. అలా చైతన్యవంతులుగా ప్రజలు మారితేనే అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరిగా ఉంటుందని పేర్కొంటున్నారు.



గుంతలు పడిన హైదర్‌గూడ రోడ్డు



ధ్వంసమైన డ్రైనేజీ మ్యాన్‌హోల్